క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన


వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యురాలు సుధామాధురి, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని శ్రీరామా కేర్ ఆస్పత్రిలో సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. బీపీ, సుగర్‌తో సాధారణ వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు అక్కేన సుధామాధురి, సతీష్, దివ్య కాంతి, బి. ఢిల్లేశ్వరరావు, తదితరులు సుమారు 350 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పి. సన్యాసినాయుడు, పి. శ్రీనివాసరావు, ప్రసాద్ మాస్టారు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన


బోరు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండంలోని సవరవిల్లి పంచాయతీ పరిధి కవులవాడ జంక్షన్ వద్ద బోరు ఏర్పాటుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోరు ఏర్పాటుతో ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపు కొత్తయ్యరెడ్డి, పట్నా తాతయ్యలు, దాట్ల శ్రీనివాసరాజు, కోరాడ అప్పన్న, పూసర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, కొమ్మూరు సుభోషణరావు, అడపా ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీ పరిశ్రమ కాలుష్యం అరికట్టాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రైతులుచోడవరం గ్రామస్తులు

పూసపాటిరేగ: సీపీ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలని సీహెచ్ అగ్రహారం మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రైతులు చోడవరం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, సీపీ పరిశ్రమ కాలుష్యంతో తాగునీరు కలుషితమైందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ విడిచిపెడుతున్న వ్యర్థాలతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పరిశ్రమలో ఉన్న ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ, ఎంపీడీఓ ఎం. రాధికలకు వినతిపత్రాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: వీటీ అగ్రహారం 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

డెంకాడ: ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనక ప్రాధాన్యమిస్తోందని డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం అన్నారు. మండలంలోని చందకపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బోరుతో పాటు శ్మశానవాటికలోని బోరును కనకసింహాచలం, గ్రామ సర్పంచ్ పతివాడ గౌరి శుక్రవారం ప్రారభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాండ్రంకి ఆదినారాయణ, రొంగలి గోపాలకృష్ణ, సిరికి అప్పారావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు..

- యుద్ధప్రాతిపదికన జల్‌జీవన్ మిషన్ పనులు


తాగునీటి సరఫరాకు ఏర్పాటు చేసిన బోరుబావి మోటారును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)


జొన్నవలసలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు

విజయనగరం రూరల్: ఇంటింటికీ తాగునీటి సరఫరాయే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో పనుల నిర్వహణకు అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ మొదటి విడత పనులు పూర్తయ్యాయి. మండలంలో తొలి విడతలో 30 గ్రామాల్లో 26 పనులకు రూ. 2.77 కోట్లు విడుదల కాగా 25 పనులు పూర్తి చేశారు. దీంతో గ్రామాల్లో ఇంటింటికీ పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు.

రూ. 72.9 కోట్లతో 36 పనులు ..

జల్‌జీవన్ మిషన్ రెండో విడతలో భాగంగా మండలానికి 17 పనులు మంజూరు కాగా... జగనన్న కాలనీల్లో మరో 19 పనులకు కలిపి రూ. 72.9 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఆయా పనులను సీసీఎస్ కమిటీ (కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డ్వాక్రా సంఘాల నుంచి 9 మందితో గ్రామ జల సంఘం ఏర్పాటు (జీజేఎస్) చేశారు. ఆయా కమిటీలకు శిక్షణ సైతం పూర్తి చేశారు. పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు, మెటీరియల్ అంతా జీజేఎస్ ఖాతాల్లోకి జమవుతుంది. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తయితే తాగునీటి ఇబ్బందులు తీరుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన నిర్మాణ పనులు


మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా మొదటి విడత పనులు పూర్తయ్యాయి. రెండో విడత 36 పనులకు సంల్గించి ఇప్పటికే రెండు పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి కాగా, మిగతా పనులను సీసీఎస్ ఆధ్వర్యంలో జీజేఎస్ ద్వారా పూర్తి చేస్తాం
– జె.సునీత, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, విజయనగరం

తాగునీటి ఇబ్బందులు తీరాయి


ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుతో తాగునీటి ఇబ్బందులు తొలగాయి. ప్రతిరోజూ తాగునీరు సరఫరా అవుతోంది. గతంలో తాగునీటికి చాలా ఇబ్బంది పడేవారం. జల్‌జీవన్ మొదటి విడతలో మా గ్రామానికి తాగునీరు అందించడం ఆనందంగా ఉంది.
– పత్తిగిల్లి లక్ష్మి, జొన్నవలస గ్రామం


జొన్నవలసలో ఇంటి కుళాయి

వైకుంఠ నారాయణుడికి ప్రత్యేక పూజలు


రామనారాయణంలో దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఈ ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ క్షేత్రమ్‌లో..

మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి శుక్రవారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ దేశానికే ఆదర్శం

- ఎంపీపీ కల్యాణి


రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి


భోగాపురం: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

పూసపాటిరేగ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని సీహెచ్ అగ్రహారంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడుతూ, వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మొదట విడత శిబిరాలు గతేడాది సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు నిర్వహించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి, రెండో విడతలో వైద్యం చేయించుకున్న వారికి నేరుగా ఇంటికే మందులు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు ఎంపీపీ చేతులమీదుగా మెడికల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గుడివాడ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు దాసరి చంద్రశేఖర్, లక్ష్మి అధ్యక్షతన జరిగిగి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేద ప్రజలకు మంచి వైద్యం అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రకళ, వైద్యులు తిరుపతి స్వామి, మజ్జి గణపతిరావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు


విజయనగరం రూరల్: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు


డెంకాడ: పెదతాడివాడలో ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్, తదితరులు


పూసపాటిరేగ: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

విజయనగరం రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సుంకరిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, హెచ్‌ఎం సుజాత, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రావణి, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

6386 మందికి మాత్రల పంపిణీ

పూసపాటిరేగ (డెంకాడ) : డెంకాడ మండల పరిధిలో 6,386 మంది పిల్లలకు ఆల్బెండోజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రాధిక, ఎస్. సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అర్బన్ సీడీపీఓ గులిపల్లి ప్రసన్న అన్నారు. శుక్రవారం స్థానిక అయ్యన్నపేటలో బాల్య వివాహాలపై బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు బి. అనురాధ, గనివాడ ఎర్రయ్యమ్మ, మేరీ అరుణకిషోర్, తదిరులు పాల్గొన్నారు.

ఆటపాటలకు సమయం కేటాయించాలి

- డీఎస్పీ గోవిందరావు

విజయనగరం అర్బన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలకు సమయం కేటాయించాలని డీఎస్పీ గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక కామాక్షినగర్‌లో గల శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యలో రాణించాలంటే ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అందుకు అవసరమైన పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోతి, డీన్ చిన్న త్రినాథ నాయుడు, పీఈటీ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం అర్బన్: డీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రేమ్‌కుమార్‌కు ఉపాధ్యాయ సంఘాల జిల్లా కమిటీ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో మెరుగైన బోధనలు అందించి జిల్లాకు రాష్ట్రస్థాయిలో పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందనలు తెలియజేసిన వారిలో పలు సంఘాల నాయకులు ఇజ్జపు రామునాయుడు, కె. శ్రీనివాసరావు, వీవీజే సుబ్రహ్మణ్యం, కె.సంతోషలక్ష్మి, ఎన్‌వీఎస్ కృష్ణారావు, ఏజీ తాతారావు, కె.భాస్కరరావు, పి. అప్పారావు ఉన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌టీఎఫ్ సంఘ రాష్ట్ర నాయకులు చిరికి శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డీఈఓను కలిశారు.

ఘనంగా పురందరదాసు ఆరాధన


పురందర దాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

విజయనగరం టౌన్: కర్ణాటక సంగీత పితామహుడు పురందర దాసు ఆరాధన, దివ్యస్మరణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్, ఉత్తరాది మఠం, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాది మఠం అర్చకుడు రాజేష్ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొత్తపల్లి సుబ్బారావు బృందం ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి ఉత్తరాది మఠంలో సంగీత ఆరాధన చేశారు. సాయంత్రం అకాడమీలో కచేరీలు నిర్వహించారు. కార్యక్రమాలను డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ అయ్యగారి రాఘవరావు, మహేశ్వరరావు, మృదంగ విద్వాంసుడు వి. అప్పలస్వామి, ధవళ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని విజయనగరంగా తీర్చిదిద్దుతా..


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా కేంద్రాన్ని సమస్యలు లేని విజయనగరంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని ఎనిమిదో డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఎవ్వరి నుంచి ఒక్క రూపాయి ఆశించకుండా వార్డులను అభివృద్ధి చేశామన్నారు. మంచినీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. కరోనా సమయంలో తనను ఆశ్రయించిన వారికి వైద్య చికిత్సలు అందించినట్లు చెప్పారు. అలాగే అయ్యకోనేరును గట్టును వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే విజయనగరాన్ని సమస్యలేని ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారినాయుడు, బొద్దాన అప్పారావు, ఎ.నగేష్, కె.మూర్తి, శేషు, అంకం కిరణ్ కుమార్, రెడ్డి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన


బొండాలు పారవేయడంపై స్థానికులను ప్రశ్నిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు శుక్రవారం ఉదయం సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాలలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను నిశితంగా పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయానికి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతున్నారా లేదా గమనించారు. అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలు పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహించారని అక్కడున్న పారిశుధ్య కార్మికులకు ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. గాంధీ పార్కు పరిసరాలను పరిశీలించారు. గాంధీ పార్కు అభివృద్ధి చేసినట్లయితే ప్రజలు మరింతగా వినియోగించుకుంటారని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే అయ్యన్నపేట, బాలాజీనగర్, ట్యాంక్‌బండ్ రోడ్డు ప్రాంతాలలో పర్యటించి పరిస్థితులను గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాఖల వారీ సమీక్షలలో తెలుసుకున్న అంశాలను పరిష్కరించే దిశగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్లు జీవీ రంగారావు, కడియాల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి, డీఈలు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట కుమ్మరవీధిలో ఉన్న స్వామి వివేకానంద పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటైన ఆధునిక హంగులను చూసి ఆశ్చర్యపోయారు. ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఇంగ్లిష్‌లో బదిలివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దిన స్థానిక కార్పొరేటర్ ఎస్‌వీవీ రాజేష్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

అద్దె భవనం కావలెను..

భోగాపురం: మండల కేంద్రంలో 70 మంది పిల్లలతో ఉన్న ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతిగృహాన్ని త్వరలో వేరే అద్దె భవనంలోకి మార్చనున్నట్లు హాస్టల్ వార్డెన్ ఎండా అప్పన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో 70 మంది పిల్లలకు అన్ని వసతులతో కూడిన విశాలమైన భవనం అద్దెకు కావాలని పేర్కొన్నారు. భవన యాజమానులు 85001 87124 నంబర్‌కి ఫోన్ ద్వారా గాని లేదా మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న వసతిగృహంలో గాని సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలతో యువత జీవితం నాశనం


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: మత్తు పదార్థాల వినియోగంతో యువత జీవితం నాశనమవుతుందని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు షేక్ మక్బూల్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ‘మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం – ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం’ అనే అంశంతో ఉద్యమ రూపంలో కార్యక్రమాలను రూపొందించామని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక కమ్మవీధిలో ఉన్న జమాతే కార్యాలయంలో ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.14.35 లక్షలతో నిర్మించిన రోడ్లు ప్రారంభం


34వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత నగర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపిస్తున్నామని చెప్పారు. నగరంలోని 34, 39 డివిజన్లలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. 14.35 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగర ప్రజలకు కావాల్సిన సదుపాయాలను సమకూరుస్తున్నట్లు చెప్పారు. గతంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రాంతాల్లో సైతం వాటర్ ట్యాంకులను నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చగలిగామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతారని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన శివారు ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తున్న ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు వింత ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, కార్పొరేటర్ జీవీ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.